క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు నడింపల్లి రామరాజు, లంక సత్తిబాబు, ఎస్.అప్పారావు ఉన్నారు.

కల్యాణం.. కమనీయం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం , శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు పెద్దరాజు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

అశోక్‌గజపతిరాజుకు వేద ఆశీర్వచనం



అశోక్‌గజపతిరాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు పుట్టినరోజు పురస్కరించుకుని సోమవారం దేవస్థానం ఉద్యోగులు, అర్చకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. విజయనగరం వెళ్లి అర్చకులు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈ హరి, సూపరింటెండెంట్ సునీల్ తదితరులు ఆయకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

నమో శివరుద్రాయ



ఉమాచంద్రమౌళేశ్వరస్వామి

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు బిల్వ పత్రాలతో పూజలు చేశారు. మహిళలు ఉమాదేవి అమ్మవారి చెంత కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

బోధనా నైపుణ్యాలపై వర్క్‌షాప్

సీతంపేట: బోధనా నైపుణ్యాలు, ఫలితాల ఆధారిత విద్యాభ్యాసం, పరిశోధన అంశాల్లో నైపుణ్యాలు మెరుగుపర్చేందుకు బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో కాలేజీలో నిర్వహిస్తున్న ఐదు రోజుల వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. పలు కళాశాలల అధ్యాపకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, రిసోర్స్ పర్సన్లుగా బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి వ్యవహరించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అధ్యాపకులను అభినందించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సోమేశ్వరరెడ్డి, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.శ్రీకాంత్, కన్వీనర్ జె.బాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పేదల సంక్షేమమే జగన్ లక్ష్యం



సంక్షేమ పథకాల లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

● ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పరవాడ: పేదల అభ్యున్నతి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. 79వ వార్డు దేశపాత్రునిపాలెంలో నాలుగోరోజు సోమవారం నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ముందుగా సచివాలయ ఉద్యోగులతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సమీక్ష నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేడయంలో విశేష కృషి చేసిన పలువురు వలంటీర్లను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామంలో గడపగడపకు వెళ్లి లబ్ధిదారులను నేరుగా కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు అర్హత లేని వారికి ప్రభుత్వ పథకాలు కట్టబెట్టాయని విమర్శించారు. చంద్రబాబు ఎన్ని కట్టుకథలు చెప్పినా ప్రజలు విశ్వసించరన్నారు. పార్టీలు చూడకుండా పథకాలు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కే విశ్వసనీయత సాధ్యమన్నారు. కార్యక్రమంలో 79వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహలక్ష్మినాయుడు, పార్టీ సీనియర్ నాయకులు కాసు అంజిరెడ్డి, డి.వి.రమణ, కర్రి వినోద్‌కుమార్, వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, తహసీల్దారు పి.కనకారావు, ఆర్ఐ శ్రీలేఖ, నాయకులు గొర్లి గోపి, రేబాక నరేష్ పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ బాధితులకు న్యాయం చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

సింహాచలం: అడవివరం నుంచి తొలిపావంచా వరకు బీఆర్‌టీఎస్ బాధితులకు న్యాయం చేయాలని పలువురు బాధితులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను కోరారు. ఈ మేరకు జీవీఎంసీ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బాధితులకు అప్పట్లో రెండు టీడీఆర్‌లు ఇచ్చారని, ఖాళీ స్థలాలు ఉన్న వారికి ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వలేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. తామంతా రోడ్డు విస్తరణకు సహకరిస్తే అధికారులు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. ఈవిషయంపై స్పందించిన కమిషనర్ తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. బీఆర్‌టీఎస్ బాధితుల సంఘం అధ్యక్షుడు అక్కిరెడ్డి అప్పారావు, వైఎస్సార్‌సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, పార్టీ ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, పార్టీ నాయకులు లంక సత్తిబాబు, గంట్ల కిరణ్, సుధీర్ తదితరులు కమిషనర్‌ను కలిసినవారిలో ఉన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం



సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న దంపతులు

సబ్బవరం:సబ్బవరంలో కొలువైన శ్రీదుర్గాలమ్మ ఆలయవార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజల్లో పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు



ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో తదితరులు

సబ్బవరం:బాలకార్మికులను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని సహాయ కార్మిక అధికారి పి. సత్యనారాయణ స్పష్టం చేశారు. బాల కార్మిక నిర్మూలన మాసోత్సవాల్లో భాగంగా చోడవరం సహాయ కార్మిక అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలంలోని పలు దుకాణాలు,సంస్థలు,దాబాలు,పలు హోటల్స్, బ్యాకరీలు,మెకానిక్ షాపుల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు.14 సంవత్సరాల్లోపు వారితో పనిచేయిస్తున్న యజమానులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్‌నాయుడు, ఐసీడీఎస్ సీడీపీవో లలిత్ కుమారి, సూపర్ వైజర్ ఆర్. పైడితల్లి, సబ్బవరం ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సోమునాయుడు పాలెం రహదారికి మరమ్మతులు



సోమునాయుడుపాలెం రహదారికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: గుంతల రహదారితో ఇబ్బందులు శీర్షికన ఇటీవల 'సాక్షి'దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గుంతలతో నిండిన సోమునాయుడుపాలెం రహదారికి చికిత్స చేస్తున్నారు. రోడ్డులో పెద్ద పెద్ద గుంతల వద్ద శిథిలాలను తొలగించి కొత్తగా రోడ్డు నిర్మాణానికి వీలుగా చర్యలు తీసుకొంటున్నారు. మూడు రోజుల్లో పాడైన రహదారిని బీటీ రోడ్డుగా తీర్చిదిద్దడానికి సన్నాహాలు చేస్తున్నారు. గుంతల రహదారికి మోక్షం లభించడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యకు ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ అప్పలరాజు

పరవాడ: పేద పిల్లల చదువులకు ఆసరాగా ఉండాలన్న లక్ష్యంతో జగనన్న అమ్మ ఒడి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు అన్నారు. వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో సోమవారం నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసిన నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు రూపు లేఖలు మారిపోయాయన్నారు. జగనన్న గోరుముద్దతో బాలలకు పౌష్టికాహారం అందుతుందన్నారు. జగనన్న విద్యా కానుక, ఆంగ్ల మాధ్యమం, సీబీఎస్ఈ వంటి కార్యక్రమాలతో విద్యారంగం రాష్ట్రంలో అగ్రగామిగా నిలుస్తుందన్నారు.హెచ్ఎం పి.కనకేశ్వరరావు మాట్లాడుతూ విదేశాల్లో చదువుకునే వారు, ఉద్యోగాలు చేయాలనే విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని టోఫెల్ అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివలంక లక్ష్మి, పాఠశాల కమిటీ చైర్మన్ పద్మావతి, కమిటీ ప్రతినిధులు వెంకటేష్, నిర్మల, ఉపాధ్యాయులు రమేష్‌బాబు, కూర్మారావు, అప్పలనాయుడు, అన్నాజీరావు, కామేశ్వరి పాల్గొన్నారు.


'డ్రగ్-ఫ్రీ వైజాగ్'కు కృషి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు

సీతంపేట: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం లంకపల్లి బుల్లయ్య కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ మైదానంలో ఎంసీఏ విద్యార్థులు ప్లకార్డులు, బ్యానర్‌లతో 'సే నో డ్రగ్స్', 'డ్రగ్-ఫ్రీ వైజాగ్' నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. సోషల్ సైన్సెస్ విద్యార్థులు ప్రదర్శించిన 'రెసిలెన్స్ అండ్ కరేజ్ టు సే నో డ్రగ్స్' స్కిట్ ఆలోచింపజేసింది. అనంతరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఎం.వెంకటరావు విద్యార్థులకు డ్రగ్స్ వల్ల వచ్చే పరిణామాలను, డ్రగ్ అడిక్ట్, మాదక ద్రవ్యాల వినియోగానికి సంబంధించిన చట్టం, శిక్షల గురించి వివరించారు. ఈ సందర్భంగా డ్రగ్-ఫ్రీ ఇండియా కోసం పాటుపడతామని విద్యార్థులంతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.వి.హెచ్.శ్రీకాంత్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వరరెడ్డి, మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

మత్తు జోలికెళితే భవిత అంధకారం



మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ సత్యనారాయణ



మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

● డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ: యువత మాదక ద్రవ్యాల వైపు మొగ్గు చూపకుండా తమ భవిష్యత్‌కు బంగారు బాట వేసుకోవాలని పరవాడ డీఎస్పీ ఎస్వీ సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ సిబ్బంది, స్థానిక కళాశాల, పాఠశాలల విద్యార్థులతో కలిసి భారీ ఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడి ఆరోగ్యాలను పాడు చేసుకోవద్దని సూచించారు.సరదా కోసం వాటి జోలి కెళితే భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. చదువులపై దృష్టి సారించి తల్లిదండ్రుల కలలను సాకారం చేసి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఈశ్వరరావు, ఎస్ఐలు తేజేశ్వరరావు, సురేష్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిన్నాభిన్నం

మత్తుకు బానిసలుగా మారితే జీవితాలు చిన్నాభిన్నంగా మారుతాయని వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాల హెచ్ఎం పి.కనకేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ సిగరెట్, గుట్కా, ఖైనీ, పాన్‌పరాగ్, కొకైన్, బ్రాందీ, విస్కీలకు బానిసలుగా మారిన వారి జీవితాలతో పాటు ఆయా కుటుంబాలు దుర్భరమైన జీవితాలను అనుభవిస్తున్నాయన్నారు. వీటి వల్ల కలిగే అనర్థాలను వివరించి.. వాటికి దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

8న ఘనంగా వైఎస్సార్ జయంతి



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: పెందుర్తి కూడలిలో జూలై 8న ఘనంగా నిర్వహించనున్న మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. దలాయిపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 8న మధ్యాహ్నం 3 గంటలకు 20 వేల మంది కార్యకర్తలతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలు నాయుడు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరవుతారని చెప్పారు. మండలంలో ప్రతి గ్రామం నుంచి 500 మందికి తగ్గకుండా కార్యకర్తలను సమీకరించి సభను విజయవంతం చేయడానికి సహకరించాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కోరారు. సమావేశంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, 79వ వార్డు పార్టీ ఇన్‌చార్జి అప్పకొండ మహలక్ష్మినాయుడు, పార్టీ సీనియర్ నాయకులు కాసు అంజిరెడ్డి, చల్లా కనకారావు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం

సింహాచలం: జీవీఎంసీ 98వార్డు అప్పన్నపాలెంలోని బాలాజీ హిల్స్ వ్యూ ఎన్‌క్లేవ్ నివాసితుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. పోటాపోటీగా జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కొట్టాన వనకుమార్, ఉపాధ్యక్షుడిగా కె.బి.సమత్‌కుమార్, కార్యదర్శిగా భవరాజు సాయిలక్ష్మీ ఫణిరాం, కోశాధికారిగా టి.మంజునాథరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఇప్పల సత్యప్రసాద్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని నివాసితులంతా అభినందించారు. ఎన్‌క్లేవ్‌లో ఎలాంటి ఇబ్బందులున్నా పరిష్కరించడానికి కృషిచేస్తామని నూతన కార్యవర్గం పేర్కొంది. అలాగే ఎన్‌క్లేవ్ తరఫున సామాజిక కార్యక్రమాలు చేపట్టేందుకు కూడా ప్రణాళిక చేస్తామని కార్యవర్గ సభ్యులు తెలిపారు.

బస్‌షెల్టర్ నిర్మించాలని వినతి



ఎంపీడీవో రమేష్ నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న వెంకటేశ్వరరావు తదితరులు

సబ్బవరం:దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సమీపంలో నూతనంగా బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు సాలాపు వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో రమేష్ నాయుడును పంచాయతీ కార్యదర్శితో కలిసి వినతిపత్రం అందజేశారు. బస్ షెల్టర్ లేకపోవడం వల్ల గొటివాడ ప్రజలతో పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. షెల్టర్ నిర్మించాలని పంచాయతీ పాలకవర్గ సభ్యులు చేసిన తీర్మాన ప్రతిని కూడా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, యడ్ల నాయుడు,పంచాయతీ కార్యదర్శి పీవీ మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న పరంజ్యోతి

సింహాచలం: బహుజన్ సమాజ్ పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి పిలుపునిచ్చారు. పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ బీఎస్పీ నాయకుల సమావేశం సోమవారం శాంతినగర్‌లోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. పరంజ్యోతి మాట్లాడుతూ ప్రజలకు చేరువగా బీఎస్పీని తీసుకెళ్లాలన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా పార్టీ కేడర్ స్పందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.తిరుపతిరావు, రాష్ట్ర ఈసీ మెంబర్ బండి ప్రకాశరావు, జిల్లా అధ్యక్షుడు బోను కృష్ణ, పార్టీ నాయకులు సీహెచ్.ప్రభాకర్, డి.గంగరాజు, ఎస్.సత్యం, బి.రమణ, కణితి దేముడు పాల్గొన్నారు.

అర్హులను గుర్తించండి



ఆరిపాకలో మహిళ నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న రాము తదితరులు

సబ్బవరం:గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించాలని మండల సచివాలయాల కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు సూచించారు.మండలంలోని అసకపల్లి,పైడివాడ,గొటివాడ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు,గృహసారథులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత మేలు జరిగేలా వలంటీర్లు,సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సబ్బవరం,పరవాడ మండలాల జగనన్న సురక్ష ఇన్‌చార్జి కొటాన రాము, నాయకులు పాలిశెట్టి సురేష్ రాజ్, సాలాపు మీణ, కాపుశెట్టి శేషుబాబు, కర్రి అప్పారావు, బోకం రామునాయుడు,సాలాపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరిపాకలో..

సబ్బవరం:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలు పలు సేవలు మరింత చేరువవుతాయని సబ్బవరం,పరవాడ మండలాల జగనన్న సురక్ష ఇన్‌చార్జి కొటాన అన్నారు. ఆరిపాక గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న సర్వే ఆయన పాల్గొన్నారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, శరగడం రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలతోనే ఆర్థికాభివృద్ధి



865వ రోజు ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగ పరిశ్రమల వల్లే దేశం ఆర్థికాభివృద్ధి సాధిస్తోందని, అటువంటి పరిశ్రమలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం వల్ల దేశంలో ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతోందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద 865వ రోజు జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్ష శిబిరంలో పలువురు కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నేడు దేశంలో ప్రజా సమస్యలను వదిలి తమ రాజకీయ అవసరాల కోసమే పాలక, ప్రతిపక్ష పార్టీలు కుట్ర రాజకీయాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. ప్రజాపోరాటాల ద్వారా జరిగే ఉద్యమాలకు పాలకులు కచ్చితంగా జవాబు ఇచ్చి తీరాలన్నారు. ఉక్కు ఉద్యమాన్ని ప్రజా పోరాటంగా మలిచి పాలకులు స్పందించే విధంగా కార్మికులు పోరాడాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరి వీడి పెట్టుబడి పెట్టి విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రకటన చేయాలన్నారు. కార్మికవర్గం అప్రమత్తంగా ఉండి తమ పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

యుద్ధప్రాతిపదికన గిరిప్రదక్షిణ రోడ్డు నిర్మాణం



గిరిప్రదక్షిణ రోడ్డు పనులపై చర్చిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, కె.కె.రాజు

సీతమ్మధార: రహదారుల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజుతో కలిసి ఆయన సోమవారం లుంబిని పార్కు, హెచ్‌బీ కాలనీ, సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్, ఎన్జీవోస్ కాలనీ, మాధవధార, ఆర్ అండ్ బీ జంక్షన్, ఎస్ఎస్‌టీఎల్, లక్ష్మీనగర్, సింహాచలం, అడవివరం తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. సీతమ్మధార అల్లూరి జంక్షన్ నుంచి ఆర్ అండ్ బీ జంక్షన్ మారియట్ హోటల్ వరకు జరుగుతున్న గిరిప్రదక్షిణ రహదారి పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వరాహ లక్ష్మీనృసింహ స్వామి గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. గిరిప్రదక్షిణ మార్గంలోని జంక్షన్లను ఆధునికీకరించాలని, 48 బస్ రూట్ విస్తరణ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్ల వెంబడి వ్యర్థాలు, వినియోగంలో లేని వాహనాలు, బడ్డీలను తొలగించాలని ఆదేశించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా పనులు

ఉత్తర నియోజకవర్గంలోని పలు సమస్యలను కమిషనర్ సాయికాంత్ వర్మ దృష్టికి కె.కె.రాజు తీసుకురాగా.. ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కె.కె.రాజు మాట్లాడుతూ భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా జీవీఎంసీ సహకారంతో గిరిప్రదక్షిణ రహదారి పనులు చకచకా జరుగుతున్నాయన్నారు. పర్యటనలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్.వి.సన్యాసిరావు, టౌన్ ప్లానింగ్ అధికారి అనిత, డీడీహెచ్ దామోదర్‌రావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, రెయ్యి వెంకటరమణ, కో-ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, ఈఈ శ్యాంసన్ రాజు, సత్యనారాయణ రాజు, వేణుగోపాల్, రామ్మోహన్, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, ఆర్.జి.వి.కృష్ణ, మల్లయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.